# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు

కొండా సత్యవతమ్మగారు

# తప్పించుకున్నాం

"**ఆరోజు తరువాత** ఇంకేం చేసారు అమ్మమ్మా? " అడిగాను “ఆ తరువాత ఇంక మాగురించి ఏదీ మేము ఆలోచించుకో లేదమ్మా. అంతా ఉద్యమం గురించీ, దేశం గురించే ... ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ సభ ఉందని చెబితే అక్కడకు వెళ్ళటం, చిన్న చిన్న ఉపన్యాసాలతో ఆడవారిని స్వాతంత్రోద్యమం వైపునకు మళ్ళించడం, స్త్రీలు చదువుకోవలసిన ఆవశ్యకతను అక్కడి స్త్రీలకు వివరించడం చేసేదాన్ని.”

" ఇంకా అక్కడి స్త్రీలలో కాస్త అక్షర జ్ఞానం ఉన్నవారిని ఆగ్రామం లోని స్త్రీ లకు చదువు చెప్పే బాధ్యతను అప్పగించేది లక్ష్మీ బాయమ్మ గారు. నాకు తోడుగా అక్కయ్య కూడా ప్రతి ఊరికీ వచ్చేది. అలా రెండు సంవత్సరాల పాటు చుట్టుప్రక్కల ఊళ్ళన్నీ తిరిగాం.

“అప్పుడే ఆంధ్రభాషోద్యమం బాగా ఊపందుకుంది”

"భాషోద్యమమా? అంటే?" అన్నాను.

“ఒకేభాష మాట్లాడే వాళ్ళందరికీ ఒక రాష్ట్రం కావాలని అన్నమాట” అన్నది అమ్మమ్మ.

"అదేంటీ అదంతా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కదా! మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అలాగే ఏర్పడింది కదా" అన్నాను.

" అవును కానీ అప్పట్లో బెంగాల్ విభజనోద్యమం జరిగాక, మద్రాస్ రాష్ట్రం లో మన తెలుగువారు వివక్షతకు గురవుతున్నారని, అక్కడి తెలుగు సంఘాలు చాలా అందోళన చేసాయి.”

"అప్పుడు మద్రాసు నివాసిగా ఉంటున్న గుంటూరుకే చెందిన కొండా వెంకటప్పయ్య గారు తరువాత ఆయనకు ప్రభుత్వం 'దేశభక్త' బిరుదును కూడా ఇచ్చి గౌరవించింది. ఆయన కూడా స్వాతంత్ర్య సంగ్రామంలో చాలా గొప్ప పాత్రపోషించారు. లా చదువుకుని మచిలీ పట్నం లో ప్రాక్టీసు చేసేవారు. పాతగుంటూరులో దేచిరాజు గారింటికి దగ్గరే కావటం తో అప్పుడప్పుడూ కనిపించేవారు.”

"ఆయన మద్రాస్ లో లా చదివే టప్పుడే కాంగ్రెస్ మూడో జాతీయ మహాసభలు అక్కడే జరిగాయట. బెనర్జీ గారు ఆసభలకు అధ్యక్షుడిగా ఉన్నారట. ఆ సభలలో సురేంద్రనాథ్ బెనర్జీ, గోపాలకృష్ణ గోఖలే, మహాగోవింద రనడే,మదన్మోహన్ మాలవ్యా, బిపిన్ చంద్ర పాల్ లాంటి వారి ఉపన్యాసాలు విని కాంగ్రెస్ పట్ల దేశం లో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమం పట్ల ఏంతో అభిమానం కలిగిందట ఆయనకు.”

“ఇవన్నీ అందరూ కూచుని చెప్పుకుంటుంటే ఆడవాళ్ళం అటువైపు చెవి వొగ్గి వినేవాళ్ళం. స్వతంత్రోద్యమ కబుర్లూ, అప్పటి రాజకీయాల కబుర్లూ మాకు ఎంతో ఉత్సాహం గా అనిపించేవి.”

“ఆయన రాజమండ్రిలో చదువుకునే టప్పుడు కందుకూరి వీరేశలింగం గారి సంస్కరణల పట్ల చాలా ఆకర్షితు లయ్యారట. విధవలుగా ఆడవాళ్ళ బాధలు చూడలేక విధవలకు మళ్ళీ వివాహాలు జరిపించే వారట. వారిని ఇళ్ళనుండి తీసుకుని వచ్చే బాధ్యత వెంకటప్పయ్య గారు తీసుకునే వారట. అదెంత కష్టమో ఎన్ని అబద్ధాలు చెప్పవలసి వచ్చేదో ఆయన హాస్యం గా చెబుతుంటే నవ్వుకునే వాళ్ళం.”

“ఆయన స్థాపించిన కృష్ణా పత్రిక చాలా బాగుండేది. సమకాలీన రాజకీయాలపై చక్కని వ్యాసాలుండేవి. ఆతరువాత కొంతకాలానికి క్రృష్ణా గుంటూరు జిల్లాలు విడిపోయాక ఆయన మచిలీ పట్నం నుండి గుంటూరు కు వచ్చేసారు. తరువాత ఆయన ఆ పత్రికను ముట్నూరు కృష్ణారావుకు అప్పగించారు.”

“ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆంధ్ర మహాసభ స్థాపించ బడింది. దాని మొట్టమొదటి సభ బాపట్లలో జరిగింది. ఆ సభకు గుంటూరు నుండి పదిహేను మంది ఆడవాళ్ళము కూడా బైలుదేరి వెళ్ళాము.

“ఆ సభలో నాకు ఒక మంచి స్నేహితురాలు పరిచయమైంది. ఆవిడే వరలక్ష్మమ్మ. ఆమె కూడా చదువుకుంది. తెలుగుగే కాక హిందీకూడా చక్కగా మాట్లాడేది.తరువాత కూడా మాస్నేహం కొనసాగింది.”

“సహాయ నిరాకరణొద్యమ సమయం లో ఆమె స్త్రిల మనసుల్లోకి బాగా చొచ్చుకు వెళ్ళేలా స్వరాజ్య లక్ష్మీ వ్రతం, రాట్నలక్ష్మీ పూజలు చేయించి, స్వదేశీ దీక్షా వస్త్రాలు అని ఖద్దరు వస్త్రాలు కట్టించేది. అప్పట్లో ఈ పూజలు గుంటూరులో కూడా ఆవిడ ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున చేయించాము. ఎంతోమంది ఈ దీక్షలు తీసుకుని ఖద్దరు వస్త్రాలే ధరించేవారు.”

“మేము ఇలా స్వాతంత్ర్య పోరాటాల్లో తలమునకలుగా ఉండగా మాకు రాఘవయ్య అన్నయ్య ఆచారి గారి చేత రాయించిన జాబు అందింది. రూపెనగుంట్లలో పరిస్థితులు ఏమీ బాగులేవనీ, వీలైనంత త్వరగా ఒకసారి వచ్చి పొలాలు చూసుకుని వెళ్ళమనీ ఆ ఉత్తరం సారాంశం.”

"నాకయితే ఆవూరు మళ్ళీ వెళ్ళాలని లేదు. కానీ దేచిరాజు వారింట కూచుని తినటమూ అంత బాగుండలేదు. కనీసం మేము తినే తిండిగింజలైనా మావూరినుండి తీసుకుని రావటం మాకూ కాస్త గౌరవం గా ఉంటుంది కదా! అనిపించింది. అక్కయ్యకు కూడా ఊరు ఒకసారి వెళ్ళొస్తే బాగుంటుంది కదా అనిపించింది. ఒక పదిహేను రోజుల తరువాత ఇద్దరమూ బయలు దేరి నరసరావు పేటకు వచ్చి, అక్కడినుండీ మావూరు చేరాం."

"మా ఇల్లు ఆలనా పాలనా లేక చుట్టూ గడ్డిపెరిగి, ఎలుకలూ, పందికొక్కులూ తిరుగాడుతున్నాయి. ఆరోజుకు ఆచారిగారింట్లో భోజనం కానిచ్చాం.వాళ్ళింట్లో మాటల్లో మాకు చాలా విషయాలు తెలిసాయి. మాదిగ సుబ్బడిని పొలం పంటవేయొద్దని మా సవతి తమ్ముడు హెచ్చరించాడనీ, అయినా సుబ్బడు ఖాతరు చేయకుండా వ్యవసాయం చేస్తుంటే, చాలాసార్లు ఏదో వంకతో దెబ్బలాటలు జరిగాయనీ, వాడి దగ్గర పనిచేసే వెట్టివాడితో ఘర్షణ జరిగి సుబ్బడు ఒకటిరెండుసార్లు దెబ్బలు కూడా తిన్నాడనీ తెలిసింది."

"అయినా పొలాలవైపు వెళుతున్నాడని నరసరావుపేట పోలీసు స్టేషన్ లో ఎవరి చేతనో పొలాల్లో ధాన్యం దొంగతనం చేసాడని సుబ్బడిమీద కేసు పెట్టించి అన్యాయం గా పోలీసులతో అరెస్టు చేయించాడని, అతని భార్యాపిల్లలూ ఏడుస్తుంటే చూడలేక రాఘవయ్య అన్నయ్యే మాకు జాబు రాయించాడనీ తెలిసి చాలా బాధపడ్డాము. సాయంత్రమేసుబ్బడి ఇంటికి వెళ్ళి అతని భార్యా, పిల్లలని పలకరించాము. బాధ పడొద్దనీ, ఏలాగైన సుబ్బడిని పోలీసు ఠాణానుంచి విడిపిస్తామనీ చెప్పాము."

"ఒక మూడురోజుల పాటు శ్రమించి ఇంటిని మళ్ళా నివాస యోగ్యం గా మార్చుకున్నాము. మూడోరోజు నలుగురు మోతుబరులను వెంటేసుకుని మా తమ్ముడు మామీదకు పోట్లాటకు వచ్చాడు. హద్దూ పద్దూ లేకుండా స్వాతంత్ర్య సంగ్రామాలంటూ ఊళ్ళుపట్టుకు తిరుగుతున్నామనీ...ఆడవాళ్ళు అందునా విధవల్లా ముసుగేసుకుని ఇంట్లో కూచోక సిగ్గూ ఎగ్గూ లేకుండా సభల్లో వేదికలెక్కుతున్నామనీ .. అన్ని వివరాలూ తనకు తెలుస్తూనే ఉన్నాయనీ ... ఇంటిపరువు తీయడానికి చెడబుట్టామనీ నానా మాటలూ అన్నాడు."

"నేను మాత్రం తలొంచుకుని ఏడుస్తూనే ఉన్నాను. అక్కయ్య మాత్రం శివంగిలాగా అంతకంటే గట్టిగా అరిచి చెప్పింది. నీలాగా భూమికి భారంగా బతకబోమనీ, స్వాతంత్ర్యం సాధించడానికి ఎన్ని కష్టాలైనా పడతామనీ, పైగా అది ఎంతో గౌరవమైన విషయమనీ, అది ఎంతమాత్రం సిగ్గుపడాల్సిన విషయం కాదనీ తెగేసి చెప్పింది."

"ఇంటిమీదకు మనుషుల్ని తీసుకుని వస్తే భయపడే పిరికి పందలం కామని హెచ్చరించింది. సుబ్బడిని అన్యాయం చేసిన ఉసురు ఊరికే పోదనీ, అతన్నెలాగైనా విడిపిస్తాను అని గట్టిగా చెప్పింది. ఆదెబ్బకు తోకముడిచి మరేమీ మాట్లాడలేక మీ అంతుచూస్తాననీ ... ఈ వూర్లో బతకలేక గుంటూరు పారిపోయామనీ ఎగతాళిగా మాట్లాడాడు."

"అప్పుడు అక్కయ్య ఇక్కడినుండే ఉద్యమాలు కొనసాగిస్తాం. ఏంచేస్తావో చూస్తానని, మళ్ళీ వ్యవసాయం కూడా చేస్తాం. మర్యాదగా వెళితే అంతమాత్రం పరువు దక్కుతుందనీ, దొమ్మీగా మనుషులను తీసుకొని ఇంటిమీదకు వచ్చావని పోలీసు స్టేషన్ లో కేసు పెడతాననీ బెదిరించింది."

"నరసరావు పేటకు వెళ్ళి తాసీల్దారుతో మాట్లాడి మా పరిస్థితులు వివరించి చెప్పి, సుబ్బడిని ఒక వారం లోపే విడిపించింది. తాసీలుదారు కూడా జమాబందీ గురించి నరసరావు పేటకు వెళ్ళిన మా తమ్ముడిని ఆడవాళ్ళను ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించినట్లు తెలిసింది. తేలుకుట్టిన దొంగలాగా కొంతకాలం మాజోలికి రాలేదు వాడు."

" ఊళ్ళో అందరూ హనుమాయమ్మ గారు సామాన్యురాలు కాదనీ, సుబ్బడిని చిటికెలో విడిపించి, దత్తు తమ్ముణ్ణి తాలీల్దారుచేత బాగా చీవాట్లు పెట్టించిందనీ చెప్పుకున్నారు. అప్పటినుంచీ కూలీ నాలీ చేసుకునే వాళ్ళందరూ, ఏ అవసరమొచ్చినా మాదగ్గరకు వచ్చేవాళ్ళు."

"నేనుకూడా సాయంత్రాలు లాంతరు వెలుగులో వాళ్ళకు కాస్త అక్షరాలు నేర్పించటం. ఇంకా చుట్టుపక్కల జరిగే విషయాలూ వివరించడం, వాళ్ళ పిల్లలు చదువుకుంటే ఎలా అభివృద్ధి చెందుతారో ఎలా అప్పుడు సమసమాజం వస్తుందో చెప్పేదాన్ని. కొంతమంది పనులకు పోతూ పిల్లలను చదువునేర్పమని నా దగ్గర దించివెళ్ళేవాళ్ళు. వాళ్ళకు అక్షరాలూ, భారత భాగవతాల్లోని చిన్న చిన్న కధలూ, పంచతంత్రం లాంటి విషయ పరిజ్ఞానాన్ని పెంచే కధలూ చెప్పేదాన్ని."

"మళ్ళీ పొలం దున్నించడం లోనూ వ్యవసాయం లోనూ కొన్నాళ్ళు గడిపాము. ఆ యేడు పంట చాలా బాగా పండింది. ఇల్లూ గాదెలూ ధాన్యం తో కళ కళ లాడాయి. అక్కయ్యకు చాలా ఆనందం వేసింది. " మళ్ళా మనమంటూ నిలబడ్డాము చిట్టెమ్మా" అని ఆనందించింది."

"అప్పుడు మొదటి ప్రపంచ యుద్ధకాలం నడుస్తున్నది. ఆ సమయం లోనే దివ్య జ్ఞాన సమాజానికి చెందిన అనిబిసెంట్ అనే ఆవిడ బాలగంగాధర తిలక్ ఆశించిన స్వపరిపాలన సూత్రానికి ఆకర్షితురాలైంది. కలకత్తాలో హోం రూల్ ఉద్యమం ప్రారంభింపబడి దేశమంతటా వ్యాప్తి చెందింది."

"ఆవిడ దేశమంతటా తిరుగుతూ ఆ వుద్యమాన్ని ప్రచారం చేసింది.ఇంకా ఆవిడ స్త్రీ ల హక్కులు,ఆలోచనా స్వాతంత్ర్యం మొదలగు వాటిమీద వ్యాసాలెన్నో రాసింది. మన ఆంధ్ర ప్రాంతం లో కూడా దీని గురించి ఒక శాఖ ఏర్పాటు చేసారు. ఈ ఉద్యమం లో గాడి చెర్ల హరిసర్వోత్తమ రావు గారూ, కొండా వెంకటప్పయ్య గారూ, రెడ్డినాయుడు గారూ మొదలైన వారు చాలా ప్రముఖ పాత్ర పోషించారు."

"పరిపాలనలో మనమూ భాగస్వాములం కావాలనీ, ఇక్కడి స్థానికులకే ఇక్కడిప్రజల ఇబ్బందులు తెలుస్తాయనీ, వేరేదేశం నుంచివచ్చి ఇక్కడ పరిపాలించే వారికి స్థానికుల కష్టనష్టాలు తెలియవనీ అందువల్ల భారతీయులకు పరిపాలనలో చోటు కావాలనీ ఉద్యమించారు."

"అందులో భాగం గానే ఊరూరూ తిరుగి కొంతమందిని సమావేశపరచి దీని గురించి వివరించే కార్య క్రమం లో నేను కూడా పాలు పంచుకున్నాను. అక్కయ్య వ్యవసాయపు పనుల్లో ఉంటే, నేను ఊరూరూ తిరిగి ప్రచారం చేసే పనిలో ఉండేదాన్ని. లోతట్టు ప్రాంతాలయిన పల్లెటూళ్ళకు కూడా ఈ ఉద్యమం చేరాలన్నది మా ఆశయం."

"నేను పొద్దున చద్దిమూటకట్టుకు బైలుదేరితే సాయంత్రానికి ఇంటికి వచ్చేదాన్ని. పదిమైళ్ళ పైబడ్డ ఊరైతే... పక్కనే ఇంకో ఊరిలోని సమావేశం చూసుకుని మర్నాడు సాయంత్రం తిరిగి వచ్చేదాన్ని. ఆహారంగా పండూ, ఫలమో.... అది దొరక్కపోతే ఎవరన్నా కుంపటీ బొగ్గులూ తెచ్చిపెడితే కొంచెం అన్నం వండుకుని వాళ్ళిచ్చిన పెరుగుతో కడుపు నింపుకునేదాన్ని. ఉద్యమాన్ని మరింత మందికి చేరవేయాలనే తపన తప్ప ఆకలి దప్పులు తెలిసేవికాదు.

అప్పుడే అలాంటి సమావేశం ఒకటి సాతులూరులో జరుగుతుందనీ, కొంచెం జన సమూహం ఎక్కువగా వస్తారనీ, అందులో ప్రసంగించాల్సి ఉంటుందనీ గుంటూరునుండి ఉత్తరం వచ్చింది నాకు. కొంచెం దూరం కనుక బండి కట్టించుకుని నరసరావు పేటవరకూ వెళ్ళి, అక్కడినుంచి నుంచి రైల్లో సాతులూరు వెళ్ళాలని ఆలోచన. ఆరోజు రాత్రికి పొనుగుబాడులో కరణం గారింట్లో బసచెయ్యాలనుకున్నాం. పొనుగుబాటి కరణం రమణయ్య గారు మాకు దగ్గరి బంధువు అందువల్ల ఒకపూట ముందుగానే అక్కడికి చేరవచ్చని అనుకున్నాం.

రైలు కోసం ప్లాట్ ఫారంమ్మీద ఎదురు చూస్తున్న మమ్మల్ని ఒక పోలీసు వచ్చి పలకరించాడు. "కొండా సత్యవతమ్మ గారు మీరేనా?" అని అడిగాడు. నేను అవునని తలూపేంతలో అక్కయ్య నా చేయిగిల్లి "నేనేనండీ సత్యవతమ్మను" అంది!"

"నేను తేరుకోకముందే ఆ పోలీసు అక్కయ్యను "మీరొకసారి స్టేషనుకు రావాల్సి ఉంటుంది. మీరు వెళ్ళేది సాతులూరికేగదా! అక్కడ ఒక సభలో మీరు ప్రసంగిస్తున్నారని తెలిసింది. అది ప్రభుత్వ వ్యతిరేక చర్య. మీరలా చేయకూడదు. అయినా ఆడవారు అందునా తలచెడిన వారులా ఉన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మీకెందుకు మర్యాదగా వెనుదిరిగి వెళతారా...లేక స్టేషనుకు నడుస్తారా" అని బెదిరించాడు.

అప్పుడు అర్ధమయ్యింది నాకు. ప్రభుత్వం పౌరులమీద బాగా నిఘావేసి ఉత్తరాలు ముందుగానే పరిశీలించి సమాచారం సేకరిస్తూ ఉండవచ్చు, లేకపోతే మా సవతి సోదరుడు మా చర్యలమీద ఉప్పందించి ఉండవచ్చు. కాసేపు ఏం చెయ్యాలో పాలుపోలేదునాకు.

"ఏవమ్మా.... చెప్తుంటే నీక్కాదూ ...వెనక్కి వెళతావా ..లేదా నాతో స్టేషనుకు వచ్చి జైలుపాలవుతావా" అని అక్కయ్యను మళ్ళీ గట్టిగా గదమాయించాడతను. అక్కయ్య నాకు నువ్వు వెళ్ళమన్నట్లు సైగచేసి."లేదుబాబూ తప్పైపోయింది నేను వెళ్ళిపోతాను" అని వెనక్కితిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. అక్కయ్య వెళుతుంటే మళ్ళీ వచ్చావో జాగ్రత్త! నేను ఇక్కడే ఉంటా అంటూ హెచ్చరించాడు."

"నేను మెదలకుండా అక్కయ్యెవరో తెలియనట్లుగా మామూలు ప్రయాణీకురాల్లాగా నిలబడ్డాను. నావైపు తిరిగి "నీపేరేంటీ? ఆమెకు నువ్వు ఏమవుతావు? ఇద్దరూ సిటీపోలీసుల్లా (విధవల్లా ) ఉన్నారు" అన్నాడు హేళనగా.

"నేనూ తెలివిన పడి, "అయ్యా! ఆమెవరో నాకు తెలీదండీ...స్టేషను బైట కలిసింది. "సాతులూరు వెళ్ళేరైలు ఇప్పుడు వస్తుందా?" అని అడిగింది. నాపేరు కోల పూడి రవణమ్మ. నేను గుంటూరు వెళ్ళుతున్నా. మా మేనమామ దశదిన కర్మలకి" అని అబద్ధం చెప్పి తప్పించుకున్నాను."

"టిక్కెట్టు కూడా కొనుక్కోలేదు ఎలారా భగవంతుడా అని ఆలోచించాను. టిక్కెట్టు కొంటేతెలిసిపోతుంది కద! ఏమైతే అదయ్యిందని ధైర్యంగా ప్లాటుఫారం మీదికి వచ్చిన రైలుబండి ఎక్కేసాను. రైలు బోగీలోకి ఎక్కిన ఒకవ్యక్తి రైలు కదిలిన తరువాత ఒక టిక్కెట్టు నా చేతికి ఇచ్చాడు. నేను ఆశ్చర్యం గా చూస్తుంటే... " మీ అక్కయ్య గారటమ్మా..... ఒక టిక్కెట్టు సాతులూరికి కొని రైలు కదిలాక మీకు ఇమ్మన్నారు " అని కొంత డబ్బుకూడా చేతిలో పెట్టాడు!"

నేను ధైర్యంగా హమ్మయ్య! అని నిట్టూర్చాను. నన్ను సమావేశం కోసం పంపటానికి తెలివిగా పోలీసునుంచి తప్పించిన అక్కయ్య సమయస్పూర్తికి మనసులోనే దణ్ణం పెట్టుకున్నాను. మానుంచి అమ్మా నాన్నలతో సహా అందరినీ తీసుకెళ్ళిన దేవుడు, మాకు ఒకరికొకరిని తోడుగా ఉంచినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నాను. అక్కయ్య తోడుంటే ఏదైనా సాధించగలనని ఎంతో నమ్మకంతో సాతులూరు సభకోసం సాగిపోయాను

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments